నాణ్యతకు పాతర..!

- నాసిరకంగా సీసీరోడ్లు
- అధికారుల పర్యవేక్షణ కరువు
- నెలరోజుల్లోనే పగుళ్లు


కప్పర్లలో కుంగిన సీసీరోడ్డు

తాంసి: గ్రామాల్లో సీసీరోడ్ల నిర్మాణానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రాధాన్యం ఇస్తూ ప్రతీ ఏటా నిధులు విడుదల చేస్తున్నాయి. ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయిస్తుంది. నాణ్యతగా చేపట్టకపోవడంతో ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతుంది. ఆయా గ్రామాల్లో వేసిన రోడ్లు నాసిరకంగా చేపడుతున్నారు. నెల రోజులకే పగుళ్లు తెలుతున్నాయి. మండలంలో ఆయా గ్రామాల్లో సీసీరోడ్లు వేసిన కొందరు ప్రజాప్రతినిధులు, కాంట్రాక్టర్‌లు అధికారులతో కుమ్మక్కై నాణ్యతకు పాతర వేశారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. తాంసి మండల కేంద్రంలో నెల రోజుల క్రితం వేసిన రహదారి పలుచోట్ల పగుళ్లు తేలి కనిపిస్తోంది. రోడ్డు నిర్మాణం నాణ్యతగా చేపట్టడం లేదని అధికారులకు ఫిర్యాదు చేసినా.. పట్టించుకోకుండా పనులు చేపట్టారని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. కప్పర్ల గ్రామంలో సైతం వేసిన సీసీరోడ్డు ఒకోచోట కుంగి గుంత ఏర్పడింది.

ఉమ్మడి మండలంలో రూ. 2.04 కోట్లలో..

తాంసి, భీంపూర్ ఉమ్మడి మండలంలో ఈ ఏడాది పలు గ్రామాల్లో పెద్ద ఎత్తున్న సీసీరోడ్ల నిర్మాణం చేపట్టారు. ఆయా గ్రామాల్లో 2.04 కోట్లతో 83 సీసీరోడ్లు నిర్మించారు. అయితే వేసిన నెల రోజులకే పలుచోట్ల పగుళ్లు తెలుతున్నాయి. నిబంధనలను పట్టించుకోకుండా తూతూమంత్రంగా పనులు చేస్తున్నారు. వేసిన రోడ్లకు సిమెంట్ కట్టలు ఏర్పాటు చేసి క్యూరింగ్ చేయడం లేదు. అధికారులు పర్యవేక్షణ లేకపోవడంతో పనులు త్వరితగతిన పూర్తి చేశారు. ఇటీవల నిర్మించిన రోడ్లను సంబంధిత ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి పగుళ్లు తెలిన పలు రోడ్లను బాగు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

నాణ్యత పాటించాలని ఆదేశాలు ఇచ్చాం

గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణంలో తప్పకుండా నాణ్యత ప్రమాణాలు పాటించి రోడ్ల నిర్మాణం చేపట్టాలని కాంట్రాక్టర్‌లకు ఆదేశాలు ఇచ్చాం.నాణ్యత లేకుండా రోడ్ల నిర్మాణం చేపడితే బిల్లులతో కోత విధిస్తాం.రోడ్లను క్వాలీటీ కంట్రోల్ అధికారులు సైతం పర్యవేక్షించిన అనంతరం బిల్లులు చెల్లిస్తాం .రోడ్ల నిర్మాణం చేపట్టే సమయంలో పలుచొట్ల నిర్మాణాలను పర్యవేక్షించడం జరిగింది.ఎక్కడైనా నిబంధలు పాటించకపోతే చర్యలు తీసుకుంటాం.గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణం సరిగ్గా చేపట్టకపోతే పిర్యాధు సైతం చేస్తే తగిన చర్యలు తీసుకుంటాం.

– మహేందర్, పంచాయతీరాజ్ ఏఈ, తాంసి

క్లుప్తంగా

15, 16న విద్యార్థులకు కౌన్సెలింగ్

ఇచ్చోడ: ఈనెల 15, 16న గిరిజన గురుకుల పాఠశాలలలో 2025- 26 విద్యా సంవత్సరానికి ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశాల కోసం ఈనెల 15, 16న ఐటీడీఏ పీవో ఖుష్బు గుప్తా ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు ఇచ్చోడ గురుకుల బాలుర పాఠశాల ప్రిన్సిపాల్ గోవర్ధన్ తెలిపారు. బాలురకు 15న గిరిజన గురుకుల జూనియర్ కళాశాల లాల్‌టెక్డి, బాలికలకు 16న కేబీ కాంప్లెక్స్ ఉట్నూర్‌లో కౌన్సెలింగ్ ఉంటుందన్నారు. పదోతరగతి పూర్తి చేసిన ఎస్టీ, ఇతర విద్యార్థులు హాజరు కావాలని కోరారు. మెమో, బోనఫైడ్, టీసీ, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతో పాటుగా ఫిజికల్ ఫిట్‌నేస్ ఆధార్ పత్రాలు తీసుకురావాలన్నారు.

‘సిబిల్ స్కోర్ పరిగణనలోకి తీసుకోవద్దు’

బోథ్: రాజీవ్ యువవికాసం పథకంలో నిరుద్యోగులకు రుణాలు మంజూరు చేయడంలో సిబిల్ స్కోర్‌ను పరిగణనలోకి తీసుకోవద్దని ధర్మ సమాజ్ పార్టీ మండల అధ్యక్షుడు కొండ మడుగు గణేష్ అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. సిబిల్ స్కోర్ వల్ల చాలా మంది నిరుద్యోగులకు రుణాలు మంజూరు కాలేని పరిస్థితి ఉందన్నారు. ఈ విషయమై ప్రభుత్వం ఆలోచించాలని కోరారు.

ప్రహరీ నిర్మించొద్దు

తాంసి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో పాఠశాల ప్రహరీ నిర్మాణం చేపట్టవద్దని గ్రామస్తులు పంచాయతీరాజ్ ఈఈ శివరాంను కోరారు. సోమవారం పాఠశాలకు వచ్చిన ఈఈ శివరాంతో మాట్లాడారు. పాఠశాల ఆవరణలో ప్రహరీ నిర్మాణం చేపడితే ఆటస్థలం ఉండదన్నారు. వారి వెంట పాఠశాల హెచ్‌ఎం శ్రీకాంత్, గ్రామపెద్దలు కృష్ణ, రాము, కళ్యాణ్, అశోక్, రాములు, చిట్టి పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో ఎద్దు మృతి

బజార్‌హత్నూర్: మండల కేంద్రంలోని పంట పొలంలో విద్యుత్ షాక్‌తో ఎద్దు మృతి చెందిన ఘటన చోటు చేసుకుంది. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం సాయత్రం ఈదురుగాలితో కూడిన వర్షం కురవడంతో రెండు విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. సోమవారం ఉదయం బత్తిని బాలాజీకి చెందిన ఎద్దు పశుగ్రాసం కోసం పంట పొలానికి వెళ్లిన సమయంలో విద్యుత్ తీగలు తగిలి అక్కడిక్కడే మృతి చెందింది. రూ. 60 వేల విలువ గల ఎద్దు మృతి చెందిందని ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు కోరుతున్నాడు.

డిజిటల్ లిటరసీపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

ఆదిలాబాద్‌టౌన్: కేజీబీవీ రూరల్ పాఠశాలలో సమ్మర్ క్యాంప్ విద్యార్థులకు సోమవారం మిషన్ శక్తి- జిల్లా మహిళా సాధికారత కేంద్రం, సఖీ కేంద్రం సంయుక్తంగా డిజిటల్ లిటరసీపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా మిషన్ కోఆర్డినేటర్ యశోద డిజిటల్ సాధనాల ద్వారా కెరీర్ అభివృద్ధి, ఇంటర్నెట్ ఉపయోగాలు, సోషల్ మీడియా, దాని ప్రభావం గురించి వివరించారు. సఖీ కేంద్రం సిబ్బంది సంఘమిత్ర సఖీ కేంద్రం సేవల గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సెక్టోరియల్ ఆఫీసర్ ఉదయశ్రీ, స్పెషల్ ఆఫీసర్ కవిత, కోటేశ్వర, కృష్ణవేణి పాల్గొన్నారు.

ప్రమాదం జరిగితేనే స్పందిస్తారా..?


విద్యుత్ తీగలు చూపిస్తున్న రైతు

జైనథ్: జైనథ్ మండలంలోని కూర గ్రామంలోని బహదూర్పూర్ శివారులో గల సుమారుగా 100 ఎకరాలకు సంబంధించిన సాగు భూమిలో విద్యుత్ తీగల సమస్య తలెత్తుతుంది. పొలంలో పని చేస్తున్న వారికి చేతికి తగిలే విధంగా విద్యుత్ తీగలు ఉన్నాయి. పలుమార్లు విద్యుత్ శాఖ అధికారులకు విషయమై విన్నవించగా స్పందించలేకపోతున్నారు. గ్రామస్తుడు రాకేశ్ మాట్లాడుతూ.. గత 6 సంవత్సరాల నుంచి విద్యుత్‌శాఖ అధికారులకు తెలియజేసినా.. పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ప్రమాదం జరిగితేనే స్పందిస్తారా అని అంటున్నారు. ఇప్పటికైనా విద్యుత్‌శాఖ అధికారులు స్పందించి సాగు భూమిలో విద్యుత్ తీగలకు మరమ్మతులు చేయాలని రైతులు కోరుతున్నారు.

విఠలేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు


ప్రత్యేక పూజలు చేస్తున్న నాయకులు

ఇచ్చోడ: భారతదేశ సరిహద్దులో పనిచేస్తున్న ఆర్మీ జవాన్‌లకు మరింత మనోధైర్యం ఇవ్వాలని సోమవారం సాయంత్రం బీజేపీ నాయకులు స్థానిక విఠలేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు రమేశ్ మాట్లాడుతూ.. భారత సైన్యానికి మరింత బలం శక్తి ఇవ్వాలని పూజలు చేసినట్లు పేర్కొన్నారు. హన్మాన్ చాలీసా పారాయణం చేసి శివునికి పాలభిషేకం చేశారు. కార్యక్రమంలో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ కదం బాబారావు, గుమ్మడి భీంరెడ్డి, కొల్లురి చంద్రశేఖర్, అజయ్, జాదవ్‌రాము, తుల్సిరాం, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ కార్యకర్తలు బీఆర్‌ఎస్‌లో చేరలేదు


మాట్లాడుతున్న నాయకులు

ఇచ్చోడ: కాంగ్రెస్ కార్యకర్తలు ఎవరు కూడా బీఆర్‌ఎస్‌లో చేరలేదని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు క్లోం నారాయణరెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. ఆదివారం తలమద్రి గ్రామానికి చెందిన వంద మంది కాంగ్రెస్ కార్యకర్తలు బీఆర్‌ఎస్‌లో చేరినట్లు ఆ నాయకులు ప్రకటించారని ఆయన తెలిపారు. తలమద్రి మాజీ సర్పంచ్, ఉపసర్పంచ్‌లు కాంగ్రెస్ కార్యకర్తలు కారని పేర్కొన్నారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు కొడప జల్దెజాకు, షేక్‌ముస్తాఫా, అక్కెపెల్లి లక్ష్మణ్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

గుడిహత్నూర్: మండలంలోని సీతాగోంది సమీపంలో జాతీయ రహదారి 44పై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడికి తీవ్ర గాయాలైనట్లు పోలీసులు తెలిపారు. తలమడుగు మండలంలోని ఝురి పూనగూడకు చెందిన కోవ నితిన్ బైక్‌పై ఆదిలాబాద్ నుంచి గుడిహత్నూర్ వైపు వెళ్తుండగా సీతాగొంది వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో నితిన్ తలకు బలమైన గాయాలయ్యాయి. గాయపడిన యువకుడిని స్థానికులు 108లో ఆదిలాబాద్ రిమ్స్ కు తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మధుకృష్ణ తెలిపారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు


మాట్లాడుతున్న తహసీల్దార్ జాడి రాజలింగు


మాట్లాడుతున్న ఆత్రం నారాయణ

నార్నూర్: ఏజెన్సీలో నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ జాడి రాజలింగు అన్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో డీలర్లు అప్రమత్తంగా ఉండాలన్నారు. బిల్ బుక్, ధరల పట్టిక బోర్డు తప్పనిసరిగా ఉండాలన్నారు. విత్తనాలపై రైతులకు తప్పుతోవ పట్టించి మోసం చేయాలని చూస్తే కఠిన చర్యలు ఉంటాయన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం స్టాక్ గదిలోనే పెట్టాలని, ఇతర చోట పెడితే సీజ్ చేస్తామన్నారు. ప్రతీ ఒక్క డీలర్ షాప్‌లో బిల్లు రసీదులు ఉండాలన్నారు. లైసెన్సు తప్పనిసరిగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఏవో ఆకాష్, ఎస్సై అఖిల్, ఏఈవోలు, ఫర్టిలైజర్స్ డీలర్లు పాల్గొన్నారు.

జైనథ్ మండల కేంద్రంలోని రైతువేదిక సంఘ భవనంలో సోమవారం రోజున జైనథ్, సత్నాల మండలాలకు సంబంధించిన గ్రామంలో నిర్వహిస్తున్న ఫర్టిలైజర్ దుకాణ యజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ఆత్రం నారాయణ మాట్లాడుతూ మండలంలోని ఫర్టిలైజర్ దుకాణల యజమానులు ప్రభుత్వం ఆమోదించిన పత్తి విత్తనాలను కొనుగోలు చేయాలన్నారు. నాణ్యమైన విత్తనాలను రైతులకు అందించాలని కోరారు. ఎమ్మార్పీ రేటు కంటే ఎక్కువ నగదు తీసుకోవద్దని సూచించారు. నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి అధికారి పూజ, సత్నాలటజీ విజయ్, తదితరులు పాల్గొన్నారు.

అధిక ధరలకు అమ్మొద్దు..

సిరికొండ: రైతులకు విత్తనాలు అధిక ధరలకు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయాధికారి శ్రద్ధరాణి హెచ్చరించారు. సోమవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో టాస్క్‌ఫోర్స్ టీం ఆధ్వర్యంలో ఫర్టిలైజర్ డీలర్స్‌తో సమావేశం నిర్వహించారు. విత్తనాలు అమ్మిన వెంటనే రశీదు ఇవ్వాలన్నారు. తహసీల్దార్ తుకారం మాట్లాడుతూ.. రైతులకు విత్తనాలను, ఎరువులను అందుబాటులో ఉంచాలన్నారు. కార్యక్రమంలో ఎస్సై శ్రీసాయి, వ్యవసాయ విస్తరణ అధికారులు ప్రవీణ్, దీపక్, రోషిణి, తదితరులు పాల్గొన్నారు.

డ్రెయినేజీ నిర్మించే స్థలం పరిశీలన


గ్రామస్తులతో మాట్లాడుతున్న అధికారులు

జైనథ్: బేల మండల సరిహద్దు నుంచి బోరాజ్ మండలం వరకు అంతరాష్ట్ర రహదారి పనులు కొనసాగుతున్న నేపథ్యంలో జైనథ్ మండల కేంద్రం వద్ద నిర్మిస్తున్న రహదారికి ఇరువైపులా డ్రెయినేజీ నిర్మాణం చేపట్టనున్నరు. ఇరువైపులా సైడ్ డ్రెన్ నిర్మాణం చేపట్టక 12వ వార్డుకు సంబంధించిన కాలనీలో వర్షపు నీరు నిలిచి ఇంటిలోకి నీరు వస్తుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం ఆర్‌అండ్‌బీ అధికారి ఏఈ భూపతిరెడ్డితో పాటు, రోడ్డు సంబంధించి అధికారులు స్థలాన్ని పరిశీలించారు. వర్షాకాలంలో ఎలాంటి నీరు నిల్వ ఉండకుండా చూసేందుకు చర్యలు చేపడతామన్నారు.

ఘనంగా వేంకటేశ్వర స్వామి కల్యాణం


వేంకటేశ్వర స్వామి కల్యాణంలో పాల్గొన్న భక్తులు

నార్నూర్: మండల కేంద్రంలోని బాలాజీ గుట్టపై ఉన్న శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామి వారి కల్యాణాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. మాజీ జెడ్పీ చైర్మన్ జనార్దన్ రాథోడ్, మాజీ సర్పంచ్ బానోత్ గజానంద్‌నాయక్, ఫాక్స్ చైర్మన్ అడే సురేశ్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ప్రజలను సుఖశాంతులు కల్పించాలని ప్రార్థించారు. కార్యక్రమంలో గ్రామపెద్ద నాయక్ ఆడే, అనిల్, జాదవ్ రెడ్డినాయక్, నారాయణ నాయక్, ఇరిగేషన్ ఈఈ విట్టల్ రాథోడ్, పంచాయతీరాజ్ డీఈఈ ధర్మేందర్ పాల్గొన్నారు.

శ్రీ రమా సత్యనారాయణ స్వామి..


సత్యనారాయణ వ్రతంలో పాల్గొన్న జంటలు

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని శ్రీ రమా సత్యనారాయణ స్వామి దేవాలయంలో వైశాఖ పౌర్ణమిని పురస్కరించుకొని శ్రీ సత్యనారాయణ స్వామి కల్యాణోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు వైభవ్ శర్మ దూబే బృందం మంత్రోచ్చారణల నడుమ సోమవారం పరిణయ వేడుక ఘనంగా జరిగింది. ఉత్సవంలో భాగంగా ఆలయంలో సత్యనారాయణ వ్రతాలను నిర్వహించగా 108 జంటలు పాల్గొన్నాయి. ఆలయ ఈవో చంద్రశేఖర్, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా బుద్ధ జయంతి వేడుకలు


ఆదిలాబాద్‌రూరల్: బుద్ధ జయంతి వేడుకలో పాల్గొన్న నాయకులు, ప్రజలు

ఆదిలాబాద్‌రూరల్: భారతీయ బౌద్ధ మహాసభ జిల్లాశాఖ ఆధ్వర్యంలో సోమవారం 2,569వ బుద్ధ జయంతి (వైశాక పూర్ణిమ) ఘనంగా నిర్వహించారు. ముందుగా జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ చౌక్ మీదుగా ధమ్మ శాంతి ర్యాలీతో కైలాస్‌నగర్‌లోని అశోక బుద్ధ విహార్‌కు చేరుకున్నారు. అక్కడ భారతీయ బౌద్ధ మహా సభ జిల్లా అధ్యక్షుడు విఠల్ బుక్లే చేతుల మీదుగా ధ్వజారోహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం తథాగత్ గౌతమ్ బుద్ధుని విగ్రహానికి, డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. పూజ్య బంతే ఆర్య సంఘమిత్ర ద్వారా బుద్ధవందన చేసి పరిత్రాన్ పాట్ తీసుకున్నారు. భారతీయ బౌద్ధ మహాసభ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రత్నజాడే ప్రజ్ఞా కుమార్, కేంద్రీయ శిక్షకులు డాక్టర్ యువరాజ్ మోరే, అనిత బాయి ఖందారే, కాంతారావు వాగ్మారేలు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వైశాఖ పౌర్ణిమను పవిత్ర దినంగా బౌద్ధులు అందరూ పెద్ద ఎత్తున ప్రపంచంలోనే నిర్వహించుకుంటారన్నారు. ప్రపంచంలోనే శాంతికి ప్రతీకగా బౌద్ధ ధమ్మమని పేర్కొన్నారు. నాయకులు దయానంద్, కృషువర్ధ, రాందాస్ భలే రావు, వినోద్, పుణేష్ వాఘ్మరే, ఆత్మారాం భలేరావ్, సమాధాన్, ఆమ్రపాల దగ్గే, బేబీ కానిందే, లలితా బాయి కిలారే, అనిల్, ఉజ్వల, రమాబాయి పాల్గొన్నారు.

బోథ్: సొనాల మండల కేంద్రంలో సోమవారం బుద్ధ పౌర్ణిమ వేడుకలను ఘనంగా నిర్వహించారు. బౌద్ధ మహాసభ సంఘం మండల అధ్యక్షుడు అమృత్ రావు మాట్లాడుతూ.. బుద్ధుని జననం వైశాఖ పౌర్ణిమ రోజున జరిగిందన్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి మూనేశ్వర్ సోమన్న, మహర్ సంఘం అధ్యక్షుడు భీంరావ్ పాటిల్, శేఖర్, పంచాక్షరి, మహేశ్, సంగపాల్, తదితరులు పాల్గొన్నారు.


ఇంద్రవెల్లి: ప్రార్థన చేస్తున్న బుద్ధ భక్తులు


బోథ్: పూజలు చేస్తున్న నాయకులు

ఇంద్రవెల్లి: మండల కేంద్రంలోని బౌద్ధ ఉపసకులు, బహుజనులు, దళిత సంఘాల ఆధ్వర్యంలో సోమవారం బుద్ధపౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని మిలింద్‌నగర్, ప్రబుద్ధనగర్, బుద్ధనగర్, సట్వాజీగూడ గ్రామాల్లో బుద్ధుడు, అంబేడ్కర్ చిత్రపటాలకు పూజలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం త్రీశరన్, పంచశీల్, బుద్ధ వందనం తీసుకున్నారు. కార్యక్రమంలో అంబేడ్కర్ మెమోరియల్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు సోన్‌కాంబ్లే మనోహర్, ప్రధాన కార్యదర్శి కామ్‌రాజ్ వాగ్మారే, లహుదాస్, మస్కే రాజువర్ధన్, దిలీప్ మోరే, ఆనంద్‌రావ్, దత్తా, వావల్కార్ శివాజీ పాల్గొన్నారు.

రైతు నమోదును సద్వినియోగం చేసుకోవాలి

ఖానాపూర్: వ్యవసాయ రంగాన్ని పూర్తిగా డిజిటలైజ్ చేయాలని సంకల్పంతో చేపట్టిన రైతు నమోదు(ఫార్మర్ రిజిస్ట్రీ) చేసుకోవాలని ఏవో జగదీశ్వర్ పేర్కొన్నారు. పట్టణంలోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో సోమవారం రైతు నమోదు కార్యక్రమాన్ని ఏఈవోలతో కలిసి చేపట్టారు. రెవెన్యూ శాఖ ద్వారా సేకరించిన భూ యాజమాన్య వివరాలను రైతు ఆధార్ సంఖ్యకు అనుసంధానం చేయడంతోపాటు సదరు రైతుకు ఫార్మర్ ఐడీ కేటాయిస్తామన్నారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.

క్రీడలతో స్నేహభావం

- బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్


బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే

నేరడిగొండ: క్రీడలతో స్నేహభావం పెంపొందడంతో పాటు శారీరకంగా దృఢంగా ఉంటారని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. మండలంలోని చిన్న బుగ్గారం మండలస్థాయి క్రికెట్ టోర్నమెంట్‌లో గెలుపొందిన జట్టుకు సోమవారం మండల కేంద్రంలోని ఆయన నివాసంలో బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆటల్లో గెలుపోటములు సహజమేనని, యువత క్రీడా స్ఫూర్తిని చాటుతూ ప్రశాంత వాతావరణంలో క్రీడలు ఆడాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, వీడీసీ అధ్యక్షుడు రవీందర్ రెడ్డి, రాథోడ్ సురేందర్, సందీప్, ప్రతాప్, పాండు, తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులపై అక్రమ కేసులు ఎత్తివేయాలి


ఎస్పీకి వినతిపత్రం అందజేస్తున్న టీయూడబ్ల్యూజే నాయకులు

ఆదిలాబాద్‌టౌన్: జర్నలిస్టులపై అక్రమ కేసులు ఎత్తివేసి, పత్రికా స్వేచ్ఛను కాపాడాలని కోరుతూ టీయూడబ్ల్యూజేహెచ్- 143 ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్, ఎస్పీలకు వినతిపత్రాలు అందజేశారు. ఇటీవల జిల్లాలో రిపోర్టర్లపై కేసులు పెరగడమే కాక, ఎలాంటి విచారణ లేకుండానే జర్నలిస్టుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసేలా కేసులు నమోదు చేస్తున్నారని సంఘం జిల్లా అధ్యక్షుడు బేత రమేశ్ అన్నారు. గుడిహత్నూర్‌తో పాటు పలు మండలాల్లో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా విలేకరులపై అక్రమంగా బనాయించిన కేసులు ఎత్తివేయాలని ఎస్పీని కోరినట్లుగా తెలిపారు. ఇందుకు స్పందించిన ఎస్పీ గుడిహత్నూర్‌లో న్యూస్ కవరేజ్ కు వెళ్లిన రిపోర్టర్‌లపై పెట్టిన కేసులను ఎత్తి వేస్తున్నట్లుగా ఎస్పీ హామీ ఇచ్చారన్నారు. ఇకపై జర్నలిస్టులపై వచ్చే ఫిర్యాదులను అక్రిడేషన్ కమిటీ చైర్మన్ కలెక్టర్ దృష్టికి తీసుకువస్తామని ఎస్పీ తెలిపారన్నారు. అసాంఘిక శక్తులను నియంత్రించేందుకు జర్నలిస్టులు సహకరించాలని సూచించారు. యూనియన్ జనరల్ సెక్రెటరీ ఎల్. రాజు, ఉపాధ్యక్షుడు అన్వర్, సిందే గంగాధర్, మాధవ్, దిగంబర్, ప్రశాంత్, సుభాష్, రత్నాకర్, శ్రీనివాస్, ప్రవీణ్, ఎం సంతోష్, శంకర్ తేజ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

ఖానాపూర్: మండలంలోని సుర్జాపూర్, బాదనకుర్తి, మేడంపల్లి గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ప్రభుత్వం ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాల్లో రైతులు ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని ఏఎంసీ చైర్మన్ భూమన్న, వైస్‌చైర్మన్ మాజిద్ సూచించారు. నాయకులు దయానంద్, చిన్నం సత్యం, వెంకాగౌడ్, నిమ్మల రమేశ్, రాజునాయక్, జంగిలి శంకర్, యూసుఫ్ ఖాన్, షౌకత్ పాషా, తోట సత్యం, గాజుల గంగన్న, ఐకేపీ ఏపీఎం భోజన్న, సీసీ భిక్‌సింగ్, తదితరులు పాల్గొన్నారు.